గూడెంకుంట ఆక్రమణల తొలగింపు



ఇంజాపూర్ గూడెంకుంటలో నిర్మించిన అక్రమ నిర్మాణాలు, ప్రీకాస్ట్ వాల్‌లను తొలగిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

హయత్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని గూడెంకుంటలో అక్రమ కట్టడాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు శనివారం తొలగించారు. సుమారు 15 ఎకరాలలో ఉన్న గూడెంకుంట చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో కొందరు రియల్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయించారు. అంతేకాకుండా రాజకీయ పలుకుబడిని ఉపయోగించి మున్సిపాలిటీ నుంచి సుమారు పది వరకు ఇంటి నిర్మాణ అనుమతులు కూడా తీసుకువచ్చారు. కొందరు ఇటీవల ప్లాట్లకు ప్రీకాస్ట్ వాల్‌లను ఏర్పాటు చేశారు. దీనిపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు స్పందించి శనివారం ఉదయం 7గంటల నుంచి అక్రమ కట్టడాలను, ప్రీకాస్ట్ వాల్‌లను, ప్లాట్ల హద్దు రాళ్లను పూర్తిగా తొలగించారు. ఇబ్రహీంపట్నం ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఏఈ తస్వీన్ రజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, సిబ్బందితో వచ్చి ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కొందరు ప్లాట్ల యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినా అధికారులు తమ పనిని నిర్విఘ్నంగా పూర్తి చేశారు. ఇదిలా ఉండగా గత పది రోజులుగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మండల పరిధిలో ఆక్రమణలకు గురైన చెరువులపై ప్రత్యేకదృష్టి సారించారు. దుబ్బకుంట, గువ్వకుంట, గూడెంకుంటలలో కబ్జాలను తొలగించి వాటికి విముక్తి కల్పిస్తున్నారు.

సీఎంను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు



సీఎం రేవంత్‌రెడ్డికి నాగలిని బహూకరిస్తున్న కృష్ణమాచారి తదితరులు

చంపాపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచారి, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ కమ్మరి, వడ్రంగి కుల వృత్తులకు చేయూత నివ్వాలని, కులవృత్తుల వారికి సబ్సిడీ రుణాలు, ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, పింఛన్లు ఇవ్వాలని సీఎంను కోరినట్లు తెలిపారు. అనంతరం సుంకోజు కృష్ణమాచారి, సంఘం సభ్యులతో కలిసి సీఎంకు నాగలిని బహూకరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కుందారం గణేష్‌చారి, ఎర్రవల్లి బాలాచారి, ప్రధాన కార్యదర్శి విష్ణుచారి, కోశాధికారి శ్రీరాములుచారి, నాయకులు రమేష్‌చారి, వెంకటేశంచారి, చంద్రశేఖరాచారి, అశోక్‌చారి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై సీఎంకు కృతజ్ఞతలు



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్‌గుప్తా

చంపాపేట, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం పట్ల శనివారం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం ధర్మకర్త బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా పేర్కొన్నారు. అనంతరం సీఎంను వారు ఘనంగా సన్మానించారు. సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పద్మారాముగుప్తా, కర్మన్‌ఘాట్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనంత రవిశెట్టి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వ్యక్తి తలకు శస్త్రచికిత్స కోసం రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంజూరు చేయించారు. ఎల్బీనగర్ సూర్యోదయనగర్ కాలనీలో నివా సం ఉంటున్న నవీన్‌కు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన తలకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. అతని కుటుంబ ఆర్థిక ఇబ్బందులను ఎమ్మెల్యేను కలిసి వివరించారు. స్పందించిన సుధీర్‌రెడ్డి శస్త్ర చికిత్స కోసం రూ.లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. సదరు ఎల్‌ఓసీ లేఖను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అనంతుల రాజిరెడ్డి, సాయికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే వివేక్ పూజలు



అర్చకుల ఆశీర్వచనాలు పొందుతున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ

చంపాపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో ధ్యానాంజనేయస్వామిని శనివారం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, అతని కుమారుడు పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో వారు ప్రత్యే క పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. తెలంగాణ మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్, ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు బీసుకుంట్ల సతీష్‌గౌడ్, బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్, యాదగిరి, తిరుమలేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సమగ్ర ప్రణాళిక

● మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్



మాట్లాడుతున్న మేయర్ దుర్గ

సరూర్‌నగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందిస్తున్నట్టు మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ తెలిపారు. నీటి సమస్యపై చర్చించే నిమిత్తం శనివారం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎక్కడెక్కడ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నదో గుర్తించి అలాంటి ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ బి.చంద్రశేఖర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ డీఈఈ వెంకన్న, ఏఈలు శ్రీనివాసులు, మహిపాల్, వాటర్ వర్క్స్ ఏఈఈ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోండి



ట్రాఫిక్ డీసీపీకి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్

కొత్తపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట-నాగోల్ చౌరస్తా దారిలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ రాచకొండ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులుకు విన్నవించారు. శనివారం ఆయన అల్కాపురి చౌరస్తా సమీపంలో గల ట్రాఫిక్ డీసీపీ కార్యాలయానికి వెళ్లారు. కొత్తపేట - నాగోల్ చౌరస్తా దారిలో మోహన్‌నగర్ పరిసరాల్లో, కొత్తపేట, గాయత్రీపురం, మారుతీనగర్, ఎస్ఆర్ఎల్ కాలనీలకు వెళ్లే దారుల్లోనూ ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ విపరీతంగా ఉండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పవన్ కుమార్ వివరించారు. కొత్తపేట డివిజన్ ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని డీసీపీకి వినతిపత్రం ఇచ్చారు.

భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల పనుల పరిశీలన

కొత్తపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీనగర్ - 1, 2 బస్తీల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఈ బస్తీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. రాజీవ్‌గాంధీనగర్-1లో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు జలమండలి అధికారులను సంప్రదిస్తామని పైప్‌లైన్ పనులు చేపట్టే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేపడతామన్నారు. రాజీవ్ గాంధీనగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కాలనీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిసర ప్రాంతాలను పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పనితీరును కార్పొరేటర్ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో ఎలాంటి చెత్త పేరుకపోకుండా పారిశుధ్య కార్మికులు కాలనీ రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో శాఖల సమన్వయం అవసరం

మన్సూరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రోడ్డు విస్తరణ పనుల కారణంగా డ్రైనేజీ లైన్లు, మంచినీటి లైన్లు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. ఆయా విభాగాల అధికారులతో కలిసి సుష్మ నుంచి చింతలకుంట వైపు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. రోడ్డు విస్తరణ కారణంగా డ్రైనేజీ లైన్లు బ్లాక్ అయ్యాయని, వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ రమేష్‌బాబు, ఏఈ చంద్రశేఖర్, ఆర్అండ్‌బీ ఈఈ ధర్మారెడ్డి, ఏఈ శరత్ పాల్గొన్నారు.

బాటసింగారం సహకార సంఘం చైర్మన్‌గా భరత్

● ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవం



భరత్‌కు నియామకపత్రం అందజేస్తున్న డీసీవో

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘం నూతన చైర్మన్‌గా తారామతిపేటకు చెందిన భరత్‌చేగూరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం కార్యాలయంలో శనివారం రంగారెడ్డి జిల్లా సహకార అధికారి ధాత్రిదేవి ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభం కావాల్సిన ఎన్నిక సమావేశం అనివార్య కారణాలతో డీసీవో ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైంది.

పోటీ లేకపోవడంతో ఏకగ్రీవం

మధ్యాహ్నం 12.15 గంటలకు ఇన్‌చార్జి చైర్మన్ నార్లకొండ మల్లమ్మజంగయ్యయాదవ్‌తో పాటు డైరెక్టర్లు చేగూరి భరత్, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, మొగుళ్ల చిన్నయాదిరెడ్డి, బిజిలి బాలనర్సింహ, మేకల రాములు, చింతల లక్ష్మమ్మ అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంఘం కార్యాలయానికి చేరుకున్నారు. మొత్తం 9మంది డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు. మధ్యాహ్నం డీసీవో ధాత్రిదేవి హాజరైన అనంతరం ఎన్నిక సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్‌గా చేగూరి భరత్‌ని డైరెక్టర్ మొగుళ్ల చిన్నయాదిరెడ్డి ప్రతిపాదించగా, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి బలపరిచారు. అనంతరం 8మంది డైరెక్టర్లు చేతులెత్తి తమ మద్దతు తెలిపారు. సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలుపడంతో సంఘం చైర్మన్‌గా చేగూరి భరత్ ఎన్నికైనట్లు డీసీవో ధాత్రిదేవి ప్రకటించారు. అనంతరం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహకార బ్యాంక్ మేనేజర్ ఐలేష్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరిపిస్తాం

సహకార సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ భరత్ తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. సంఘంలో జరిగిన అవకతవకలపై అధికారులతో విచారణ జరిపిస్తామని, అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఒంటెద్దు పోకడలతో గత చైర్మన్ సంఘాన్ని భ్రష్టుపట్టించాడని ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు భరత్‌కు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ ఎంపీటీసీ చేగూరి వెంకటేష్, దోటి వెంకటేష్‌యాదవ్, మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారి, కిట్టుయాదవ్, రాముయాదవ్, నాగ కిష్టయ్య ఉన్నారు.



గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో జరిగిన ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మెన్స్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించిన వనస్థలిపురం ఏసీపీ పీ. కాసిరెడ్డిని కమిషనరేట్‌లో సీపీ తరుణ్‌జోషి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, అందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామన్నారు. - హైదరాబాద్‌సిటీ, ఆంధ్రజ్యోతి

భగత్‌సింగ్‌కు నివాళి



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి

ఎల్బీనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర సంగ్రామంలో యువతకు స్పూర్తిదాయకంగా నిలిచి, బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవవీరుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ చెరువు కట్టపై ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ వీరత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ మండల ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు మహేష్, భాస్కర్, మల్లేష్, విజయ్, నవీన్, ఆకాష్, ఈశ్వర్, శివ, చింటూ, నాని, చందు, మహేష్ పాల్గొన్నారు.

వర్కర్స్ పార్టీ ఆధ్వర్యంలో..

కొత్తపేటలోని సిరిపురం యాదయ్య చౌరస్తాలో వర్కర్స్ పార్టీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి వర్కర్స్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులు దేశ స్వాతంత్రం కోసం పోరాడి ఉరికొయ్యను ముద్దాడిన వీరులని పాండురంగాచారి కొనియాడారు. వర్కర్స్ పార్టీ నాయకుడు కొప్పు యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్కర్స్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య ముదిరాజ్, అజయ్‌కుమార్, పూజారి శ్రీను, రవికుమార్, ఇస్మాయిల్, దండు నిరంజన్, దేరంగుల యాదయ్య, వర్రె ఇస్తారి పాల్గొన్నారు.

నీటి వృథాని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత

● 10వ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మాధవి



నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హయత్‌నగర్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ సహకారంతో సీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, వినియోగం, శాంతి కోసం నీరు.. స్థిరమైన అభివృద్ధి లక్ష్యం.. అనే ఆరు నిబంధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ 10వ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మాధవి హాజరై మాట్లాడారు. డివిజన్‌లో నీటి కొరత రాకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. నీటి వృథాని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో ఎస్. నాగబ్రహ్మాచారి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనాజనితో పాటు విద్యార్థులు, అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దఅంబర్‌పేట్ టీపీవోగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ టీపీవోగా ఇ. శ్రీనివాస్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ నెల 6న టీపీవోను నియమిస్తూ ఉత్తర్వులు జారీ, 20 రోజులు గడిచినా బాధ్యతలు తీసుకోని టీపీవో అంటూ శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రతికలో ప్రచురితమైన 'అమ్మో..పెద్దఅంబర్‌పేటకా' కథనానికి మున్సిపల్, జిల్లా అధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో శనివారం టీపీవో శ్రీనివాస్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● డీపీవో సురేష్‌మోహన్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తారామతిపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులతో పాటు శానిటేషన్, శ్మశానవాటిక, నర్సరీ, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వినోద, ఎంపీటీసీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే ఢిల్లీ సీఎం అరెస్ట్

● సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

హయత్‌నగర్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ఎలక్టోరల్ బాండ్లలో బీజేపీ అవినీతిపై ప్రజల దృష్టి మళ్లించడానికే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. భాస్కర్ అన్నారు. వామపక్ష పార్టీలు ఇచ్చిన నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో తుర్కయంజాల్ చౌరస్తా వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దేశంలోని ప్రతి పక్ష పార్టీలను బలహీన పరచడానికే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొలుపుతుందని ఆరోపించారు. పథకం ప్రకారమే ఢిల్లీ ముఖ్యమంత్రి అరెస్ట్ జరిగిందన్నారు. భూకుంభ కోణం విషయంలో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను, అదేవిధంగా మహారాష్ట్ర తమిళనాడులో ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, నాయకులు ప్రకాష్‌కారత్, శంకర్, జగన్, సత్యనారాయణ, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ఏప్రిల్ 7లోగా హమాలీల సమస్యను పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : పండ్ల మార్కెట్‌లో కార్మికుల హమాలీ చార్జీలను వెంటనే పెంచాలని లేదంటే సమ్మెకు దిగుతామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం హమాలీ కార్మిక సంఘం నేతలతో కలిసి మార్కెట్ కమిటీ సెక్రెటరీ చిలుక నర్సింహరెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల ఏప్రిల్ 7వ తేదీలోగా హమాలీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే అదే రోజు అర్ధరాత్రి నుంచి సమ్మెను ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య, పండ్ల మార్కెట్ హమాలీ సంఘం అధ్యక్షుడు సయ్యద్ మసూద్, ఎండీ షరీఫ్, పోచయ్య, చిన్నరాములు, గంగారాం, తిప్పన్న, మున్నా పాల్గొన్నారు.

ట్యాంకర్లకు రూ.2వేలు

(5వ పేజీ తరువాయి)

గృహావసరాలకు రూ.500కు, వాణిజ్య అవసరాలకు రూ.850కు విక్రయిస్తున్నది. ప్రైవేట్ ట్యాంకర్ల దోపిడీని భరించలేని మాదాపూర్ ప్రాంతంలోని నివాసితులు కొత్త ఉపాయం పన్నారు. స్నేహితులు, పరిచయస్తులు, బంధువుల ఇళ్ల పేరిట వాటర్‌బోర్డు ట్యాంకర్‌ను బుక్ చేసుకుని నీటిని తెప్పించుకుంటున్నారు.

మామూళ్ల మత్తులో..

మాదాపూర్, గుట్టలబేగంపేట ప్రాంతాల్లోని సున్నంచెరువు పరిసర ప్రాంతాల్లో కొందరు పెద్దఎత్తున బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. రోజుకు వందలాది ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను సామర్థ్యాన్ని బట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ శాఖల నిర్లక్ష్యం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని జనం వాపోతున్నారు.

25 ప్రాంతాల్లో డిమాండ్

గ్రేటర్ పరిధిలోని 25 ప్రాంతాల్లో పెద్దఎత్తున ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. ప్రధానంగా మాదాపూర్, షేక్‌పేట, ఎర్రగడ్డ, మియాపూర్, హఫీజ్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, మణికొండ, మూసాపేట, కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, గచ్చిబౌలి, ఎల్లారెడ్డిగూడ, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్‌లకు బుకింగ్‌లు ఎక్కువగా అవుతున్నాయి. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన 1,300 ట్యాంకర్లు బుకింగ్ కాగా, మార్చి 22న 4,079 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. రెండు నెలల వ్యవధిలోనే మూడింతల డిమాండ్ పెరగడం నీటి కొరత, అవసరానికి అద్దం పడుతున్నది. కాగా బస్తీలతో పాటు ఆలయాలు, మసీదులు తదితర వాటికి జనవరి ఒకటో తేదీన 350 ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందిస్తే.. ప్రస్తుతం రోజుకు 637 ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. మున్ముందు మరింత అధికంగా ట్యాంకర్ల బుకింగ్ పెరిగే అవకాశాలున్నాయి.

ఆ ఏడు డివిజన్లలో 84శాతం డిమాండ్

వాటర్‌బోర్డు పరిధిలో దాదాపు 580కి పైగా ట్యాంకర్లున్నాయి. వీటి ద్వారా ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటలవరకు.. రెండు షిఫ్టుల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్‌బోర్డు పరిధిలో మొత్తం 24 డివిజన్లు ఉండగా, ఆరు డివిజన్లలోనే ట్యాంకర్ డిమాండ్ 84 శాతం మేరకు ఉన్నది. అందులో.. 35 శాతం హఫీజ్‌పేట, పటాన్‌చెరు, శేరిలింగంపల్లి(డివిజన్-15)లలో, 22 శాతం ఎస్ఆర్‌నగర్(డివిజన్-6)లో, 14 శాతం కూకట్‌పల్లి(డివిజన్-9)లో, 7 శాతం మణికొండ(డివిజన్-18)లో, ఆరు శాతం నిజాంపేట్(డివిజన్-23)లో డిమాండ్ ఏర్పడుతున్నది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా నీటిని సరఫరా చేయడానికి అదనంగా మరిన్ని ట్యాంకర్లను సమకూర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పగటి సమయంలోనూ ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీ కారణంగా డెలివరీ ఆలస్యమవుతోంది. దీంతో ట్రిప్పుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో వీధుల్లో ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నది. దీంతో రాత్రి సమయాల్లో అదనంగా మరో షిఫ్ట్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సుదర్శన హోమం

చంపాపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నాలుగో రోజు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయంలో ఉదయం గణపతిపూజ, నవగ్రహారాధన, ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు లక్ష తమలపాకులతో పూజలు, మంటపారాధన పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ఆలయ డైరెక్టర్లు ధన్వంతరీ సహిత మహా సుదర్శన హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మశ్రీ శ్రీరామశరన్ గురూజీ, రమణ గురుస్వామి, ఆలయ ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, విజ్ఞేశ్వర్‌రెడ్డి, మిరియాల అంజయ్యగుప్తా, దశరథ్‌గౌడ్, సుంకరి రమేష్ గౌడ్, నిర్మలేష్‌గుప్తా, హరికృష్ణగుప్తా, కేశవరెడ్డి, భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అటవీశాఖ అడ్డుకోవటం తగదు



నిరసన తెలియజేస్తున్న మాదిగ కులస్థులు

మన్సూరాబాద్, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్‌లోని మాదిగ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవటం తగదని మన్సూరాబాద్ పాత గ్రామానికి చెందిన మాదిగ కులస్థులు శనివారం సదరు శ్మశాన వాటిక వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిగ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.36లక్షలు నిధులు మంజూరయ్యాయని, పనులు చేపడుతుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారన్నారు. యంజాల రమేష్, సురేష్, చందు, యాదగిరి, సత్య పాల్గొంటారు.

నేడు బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం

కొత్తపేట, మార్చి 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట - నాగోల్ దారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎదురుగా ఉన్న శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నేడు(ఆదివారం)మధ్యాహ్నం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య(టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, హైదరాబాద్ - రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు, బ్రాహ్మణ ప్రముఖులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాలరావు పాల్గొంటారని తెలిపారు. విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ పీసీసీ అధ్యక్షుడు, ఇతర బ్రాహ్మణ ప్రముఖులు హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. బ్రాహ్మణ సోదరులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

తల్లి మందలించడంతో పారిపోయిన బాలుడు

● అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించిన సురక్ష సేవా సంఘం



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న సురక్ష సంఘం అధ్యక్షుడు గోపిశంకర్‌యాదవ్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23(ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి పారిపోయిన బాలుడిని సురక్ష సేవా సంఘం ప్రతినిధులు చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపి శంకర్‌యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వనస్థలిపురం ఎస్‌జీకేస్ కాలనీకి చెందిన శాంతి తన కుమారుడైన జోనాథన్(12)ను ఉదయం 7గంటల ప్రాంతంలో మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన బాలుడు ఇంట్లో చెప్పకుండా అబ్దు ల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలోని ఓ చర్చి వద్ద ఏడుస్తూ కూర్చున్నాడు. బాలుడిని గమనించిన సురక్ష సం ఘం సభ్యులు చేరదీసి వివరాలు అడిగితెలుసుకున్నారు. పూర్తి సమాచారం చెప్పకపోవడంతో బాలుడి విషయాన్ని వివిధ వాట్సాప్ గ్రూపులలో పోస్ట్ చేశారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా విషయం తెలుసుకున్న బాలుడి తల్లి శాంతి జేఎన్ఎన్‌యూ ఆర్ఎం కాలనీలోని సురక్ష సేవా సంఘం కార్యాలయానికి వెళ్లింది. పూర్తి వివరాలు సేకరించిన సంఘం సభ్యులు బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు. సంఘం సభ్యులు ప్రేమ్‌రాజ్, మొగిలయ్య తదితరులు ఉన్నారు.

నేడు చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ సమావేశం

ఎల్బీనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు శనివారం బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ తెలిపారు. మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని సామ యాదిరెడ్డి గార్డెన్ (ఎస్‌వైఆర్)లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం పార్టీ కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ పరిశీలకులు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన చెప్పారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌లోకి కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చంపాపేట : కుమ్మరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్‌తో పాటు పలువురు కుమ్మరి సంఘం, బీఆర్ఎస్ నేతలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, టీపీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు.